సాక్షి చిత్తూరు

ఆదివారం । 28 । జూలై । 2024



ఘాట్‌లో వాహనాలు ఢీకొని..

మొగిలి ఘాట్‌లో జాతీయ రహదారిపై వాహనాలు ఢీకొని ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. - 8లో



దేవుని భూమి కబ్జాకు కుట్ర

పలమనేరు పట్టణంలోని రూ.20 కోట్ల విలువైన దేవుని భూమిని కబ్జా చేసేందుకు తమ్ముళ్లు కుట్రకు తెరతీశారు. - 8లో



మామిడి మండీలు దగ్ధం

పాకాల మండలం దామలచెరువులో శనివారం చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో 11 మామిడి మండీలు దగ్ధమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

ఇద్దరు ఎంపీడీఓలకు షోకాజ్

చిత్తూరు కార్పొరేషన్‌: విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో జిల్లాలోని ఇద్దరు ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులతోపాటు విధుల దుర్వినియోగం పై ఏఓను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాటి ప్రకారం జీడీనెల్లూరు ఎంపీడీవో భాస్కర్, గంగవరం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నట్లు జెడ్పీ అధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై విచారణ చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సీఈఓ గ్లోరియాను ఆదేశించారు. విచారణ చేయగా ఫిర్యాదులు వాస్తవమని తేలింది. ఎంపీడీఓలు సెలవు పెట్టకుండా బయటకు వెళ్లడం, కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని తేలింది.

ఏవో సస్పెన్షన్

జీడీనెల్లూరు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. ఏఓ తన విధులను అతిక్రమించి గ్రామ సచివాలయాలను తనిఖీలు చేసి ఉద్యోగులకు నోటీసులు ఇచ్చారు. మండల సర్వసభ సమావేశంలో తీర్మానం లేకుండా నిధులను వినియోగించినట్లు ఎంపీపీ అనిత ఫిర్యాదు చేశారు. గతంలో ఏవో సుధాకర్ కొన్ని నెలలు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేశారు. ఈ సమయంలో ఆయన వ్యవహారశైలి, పలు అంశాలను ఎంపీపీ రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీటిపై సీఈఓ గ్లోరియా విచారించి నివేదిక ఇవ్వగా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు.

రెండు కేంద్రాల్లో ఏపీపీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్‌: నగరంలో రెండు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్‌మోహన్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్లో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాల్లో 3,142 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. రెండు సెషన్లలో పరీక్ష ఉంటుందన్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు.

బీటెక్‌లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ, స్వీడన్‌కు చెందిన బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించే బీటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లో ఆగస్టు 1వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు చేస్తున్నట్టు వర్సిటీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ డ్యూయల్ డిగ్రీలో చేరే విద్యార్థులు 3 ఏళ్లు పాటు మహిళా వర్సిటీలో కోర్సు చదవాల్సి ఉంటుందని, మరో ఏడాది స్వీడన్‌లోని బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యనభ్యసించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్‌లో 70 శాతం మార్కులు సాధించి, ఏపీ ఈఏఎంసెట్-2024లో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు మహిళా వర్సిటీలోని డీన్, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆఫీసులో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ లేదా 7995973878, 9390934349లో సంప్రదించాలని కోరారు.

- పలమనేరుకు చెందిన రాజేశ్వరి, మహిళా గ్రూపులోని ఆర్‌పీ మాటలు నమ్మి అప్పులు తెచ్చి రూ.1.90 లక్షలు డాయ్ యాప్‌లో కట్టి మోసపోయింది. ఇదంతా తన భర్తకు తెలియకుండా చేసింది. ఇప్పుడు భర్త ఆమెతో గొడవపడి, ఇంటి నుంచి తరిమేశాడు.
- పట్టణానికి చెందిన అనిల్‌కుమార్ అప్పు చేసి మరీ రూ.93 వేలను యాప్‌లో కట్టి పోగొట్టుకున్నాడు.
- స్థానిక కొత్తపేటకు చెందిన భాగ్యలక్ష్మి బంగారాన్ని తాకట్టు పెట్టి ఇందులో రూ.లక్ష కట్టింది.
- భర్తలేని వసంతి చిన్నకొట్టు ద్వారా జీవనం సాగిస్తూ ఇందులో రూ.3 లక్షలు పోగొట్టుకుంది. ఇంకా అనురాధ, వాణి, దివ్యలే కాదు జిల్లాలోని వేలాదిమంది గొలుసుకట్టు యాప్‌ల ద్వారా కోట్లాది రూపాయలు మోసపోయారు.



పోలీస్ స్టేషన్ వద్ద డాయ్ యాప్ బాధితులు

గొలుసుకట్టు.. కొల్లగొట్టు

- చైన్ లింక్‌కు మోసపోయిన మహిళలు
- బంగారు తాకట్టుపెట్టి, అప్పులు చేసి కట్టారు
- జిల్లాలో కోట్లు పోగొట్టుకున్న బాధితులు
- కొంపలు ముంచుతున్న మాయదారి యాప్‌లు



యాప్ పేరిట స్థానిక నిర్వాహకులు జారీచేసిన ఐడీ కార్డు

పలమనేరు: మున్సిపాలిటీలోని మెప్మా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా రాజేష్ పనిచేస్తున్నాడు. ఇతని స్నేహితుడు పట్టణానికే చెందిన ఓ హోటల్ యజమాని ద్వారా బయటి వ్యక్తుల ద్వారా డాయ్ యాప్ కథ మొదలైంది. రాజేష్ పనిచేసే కార్యాలయంలో 26 వార్డులకు చెందిన 40మంది దాకా ఆర్‌పీ(రిసోర్స్‌పర్సన్)లున్నారు. వీరి ఆధ్వర్యంలో పట్టణంలోని పది వేలమంది గ్రూపు సభ్యులు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. తొలుత కార్యాలయంలోని ఆర్‌పీలు, సీవోలను ఇందులోకి దించి వారికి నిత్యం డబ్బులు ఖాతాలోకి వచ్చేలా చేశారు. వీరి ద్వారా గ్రూపుల్లోని మహిళలను ఇందులోకి వచ్చేలా చేసి మోసానికి పాల్పడ్డారు.

ఇప్పటికే పలు చోట్ల ఇదేతరహా మోసాలు

పలమనేరులో జరిగినట్టే చిత్తూరులోనూ యాప్ మోసం తాజాగా బయటపడింది. ఇక్కడే కాక గుంటూరు, అనంతపూర్, తెలంగాణాలోని పలుచోట్ల గతంలో యాప్ మోసాలు జరిగినట్టు తెలుస్తోంది. దీంతో అక్కడి పోలీసులు సైతం యాప్‌లను నమ్మి మోసపోరాదంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో ప్రాంతంలో కొన్నాళ్లపాటు స్థానికుల ద్వారా యాప్ కార్యకలాపాలను నిర్వహించి ఆపై యాప్‌ను మాయం చేస్తున్నారు. మోసపోయామని గమనించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయుంటుంది. పలమనేరులో ఈ నెల 21న యాప్ కనిపించకుండా పోయే నాటికి దీని బారిన వేలాది మంది పడినట్టు తెలుస్తోంది.

ఏఐ టెక్నాలజీతో నడిచేయాప్

డాయ్ యాప్ సాధరణ ప్లేస్టోర్‌లా కాకుండా లింక్‌ద్వారా మాత్రమే ఇన్‌స్టాల్ అవుతుంది. ఇది పూర్తిగా ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నడుస్తుంది. మనకు యాప్ నుంచి వచ్చే కాల్స్ కేవలం వినేందుకు మాత్రమే మాట్లాడేందుకు వీలు కాదు. వీటికి ఎలాంటి అనుమతులుండవు. కేవలం సిస్టమ్ ద్వారా ఎక్కడినుంచో మొత్తం నెట్‌వర్క్ జరుగుతుంది. ఇందులో కాస్త తెలివైన వారిని మేనేజర్‌గా నియమించుకొని మొత్తం వ్యవహారాన్ని నడుపుతుంటారు. మొదట్లో జనానికి ఆశచూపి క్రెడిట్ అవుతున్న మొత్తం భారీ స్థాయిలో చేరే సరికి యాప్‌ను కనిపించకుండా చేసేస్తారు. ఆపై ఏమీ చేసినా యాప్ కనిపించదు. ఎవరిని సంప్రదించాలో తెలియదు.

డాయ్ యాప్ ఘటనపై విచారణ కమిటీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పలమనేరులో జరిగిన డాయ్ యాప్ ఘటనపై విచారణ కమిటీని నియమించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పలమనేరు ప్రాంతంలో డాయ్ యాప్ వలలో బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మెప్మా పీడీ ఆధ్వర్యంలో విచారణ కమిటీని నియమించామన్నారు. కమిటీలో రెవెన్యూ శాఖ తరపున డిప్యూటీ తహసీల్దార్, పోలీసుశాఖ తరపున సీఐ సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఈ కమిటీ ఈ నెల 29, 30 తేదీల్లో పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి కార్యాలయపు పనివేళల్లో విచారణ జరుపుతుందన్నారు. డాయ్ యాప్ బాధితులు విచారణ కమిటీకి ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ వెల్లడించారు.

'డాయ్' బాధితులకు బెదిరింపులు

- చైన్ లింక్‌లో 'మెప్మా' పేరు వాడొద్దంటూ హుకుం
- రూ.30 లక్షల వరకు మహిళలకు కుచ్చు టోపీ
- 'లక్కీ' వారియర్ వాట్సప్ గ్రూప్ పేరిట లావాదేవీలు



చిత్తూరు అర్బన్‌: సామాన్యుల ఆశను ఆధారంగా చేసుకుని రూ.కోట్లలో దోచుకున్న 'డాయ్' (డాటామీర్ ఏఐ) సంస్థ బాధితులు చిత్తూరు నగరంలోనూ వెలుగు చూస్తున్నారు. పలమనేరు పట్టణంలో వెలుగు చూసిన ఈ భారీ మోసంలో దాదాపు రూ.30 కోట్ల వరకు బాధితుల నుంచి రాబట్టుకున్న డాయ్ సంస్థ బోర్డు తిప్పేసిన విషయం తెలిసిందే. దీని బాధితులు చిత్తూరులో కూడా ఉన్నారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)లో పనిచేసే ఓ ఉద్యోగి పాత్ర ఇందులో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవో) కొందరు ఈ స్కీమ్‌లో చేరి మహిళలపై ఒత్తిడి పెంచి డాయ్ సంస్థలో పెట్టుబడులు పెట్టించినట్లు తెలుస్తోంది. ఈ చైన్‌లింక్ ద్వారా రూ.30 లక్షలకు పైగా నగదు పోగొట్టుకున్నట్లు పలువురు స్వయం సహాయక మహిళలు ఆరోపిస్తున్నారు. మొబైల్‌ఫోన్ యాప్‌లలో వచ్చే పలు ప్రకటనలకు రేటింగ్ ఇచ్చి.. కొద్ది మొత్తం పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తుందనే అత్యాశతో ఈ సంస్థలో పెద్ద సంఖ్యలో మహిళలు చేరి, బాధితులుగా మారారు. యాప్‌లో ఒకర్ని చేర్చి, వారు మరో పది మందిని ఇందులో చేర్పిస్తే కమిషన్ రూపంలో పెద్ద మొత్తంలో నగదు వస్తుందనే మరో మోసానికి కూడా తెరతీశారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని ఇద్దరు ఉద్యోగులను నమ్మిన మహిళా సంఘాల సభ్యులు రూ.30 లక్షల వరకు ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయారు. ప్రధానంగా మహిళా సంఘాలను పర్యవేక్షించే కొందరు రిసోర్స్ పర్సన్లు కమిషన్‌కు ఆశపడి పెద్ద సంఖ్యలో మహిళల్ని ఇందులో సభ్యులుగా చేర్పించారు. కార్పొరేషన్‌కు చెందిన మహిళా మార్టు, స్వయం సహాయక సంఘాల్లోని పలువురు సభ్యులు ఈ యాప్‌లో పెట్టుబడులు పెట్టడానికి పెద్ద మొత్తంలో అప్పులు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఆటో నడుపుతున్న వ్యక్తి భార్య ఒకరు తన చుట్టుపక్కల మహిళల ద్వారా రూ.10 లక్షలను డాయ్ కంపెనీలో పెట్టుబడిగా పెట్టినట్లు వెలుగుచూసింది. ఈ మోసం బయటకు పొక్కడంతో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ మెప్మా పేరు ఎక్కడా వాడొద్దని, ఎద్దైనా ఉంటే పలమనేరు వెళ్లి తేల్చుకోవాలని ఓ ఉద్యోగి బాధిత మహిళల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పలువురు బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

రూ.3 వేలకు వారంలో రూ.5,292

డాయ్ యాప్‌లో సభ్యులుగా చిత్తూరుకు చెందిన మహిళల్ని పెద్ద సంఖ్యలో చేర్పించడంలో మెప్మాలోని ఉద్యోగితో పాటు కొందరు ఆర్పీలు కీలకంగా వ్యవహరించినట్లు అర్థమవుతోంది. లక్కీ వారియర్ పేరిట వాట్సప్ గ్రూప్‌ను తయారుచేసి, పెట్టుబడులు పెట్టేవాళ్లను సభ్యులుగా చేర్చారు. ఎఫ్ఈ రూబోట్ పేరిట ఒక్కసారి రూ.3 వేలు పెడితే రోజుకు రూ.756 చొప్పున వారంలో రూ.5,292, రూ.7 వేలు పెడితే రూ.13,813, రూ.9 వేలు పెడితే అయిదు రోజుల్లో రూ.13,365 వస్తుందని ప్రచారం చేశారు. మహిళల ఆర్థిక బలహీనతను ఆసరాగా చేసుకుని బోర్డు తిప్పేశారు.

మా బాధ ఎవరికి చెప్పుకోవాలో...



గ్రూపుల్లో ఉండే మాకు యాప్ గురించి ఏమీ తెలీదు. మా ఆర్‌పీ డబ్బులు బాగా సంపాదించే మార్గమని మా చేత కట్టించారు. నేను అప్పు చేసి ఇందులో డబ్బులు కట్టా. ఇప్పుడు ఆర్‌పీలను అడిగితే మాకు రూ.లక్షల్లో నష్టం వచ్చింది మేమేమి చేసేదంటున్నారు. ఇంక మేము ఎవరికి చెప్పినా పోయిన డబ్బు వచ్చేలాలేదే.

– రాజేశ్వరి, గ్రూపు సభ్యురాలు, పలమనేరు

అందరికీ లాభం వస్తా ఉందని నమ్మి...



నాకు తెలిసిన వాళ్లు చెప్పినమాట విని రెట్టింపు లాభం ఉంటుందని డబ్బులు కట్టా. మొదట్లో కొన్ని రోజులు డబ్బులు వచ్చాయి. దీంతో ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టా. ఆపై మొబైల్‌లో యాప్ కనిపించకుండా పోయింది. అప్పుచేసిన డబ్బు మొత్తం పోయింది. ఇప్పుడు ఏమి చేయాలో.. ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచడం లేదు.

– అనిల్‌కుమార్, పలమనేరు

నగలు తాకట్టు పెట్టి కట్టా



మా ఆర్‌పీ చెప్పింది కాబట్టి నమ్మి ఇందులో చేరా. రోజుకి 200 వస్తా ఉంది కదా ఇంకా ఎక్కువగా డబ్బులు వస్తాయన ఆశపడ్డా. దీంతో నగలను తాకట్టు పెట్టి ఇందులో కట్టాను. ఇప్పుడు మోసపోయానని తెలిసింది. మా ఇంట్లోవాళ్లు సైతం ఎందుకు ఇలా చేశావని గొడవకు దిగారు. ఇకపై గ్రూపుల్లో అప్పు డబ్బు కట్టేందుకు కూడా కుదరకుండా పోయింది.

– భాగ్యలక్ష్మి, పలమనేరు

యాప్‌లను నమ్మి మోసపోకండి



గొలుసుకట్టు, యాప్‌లను నమ్మి డబ్బులు కట్టొద్దని ముందునుంచి చెబుతూనే ఉన్నాం. కానీ అత్యాశకుపోయి కష్టాలను కొనితెచ్చుకుంటున్నారు. సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మనం జాగ్రత్తగా ఉండాలి. ఎవరికైనా ఊరికే డబ్బులిస్తామా. దానికి గ్యారెంటీ చూస్తాం కదా ఇందులో మాత్రం ఎలా పెడతారో అర్థంకాదు. ఇకనైనా ప్రజలు ఇలాంటి వాటి జోలికెళ్లకుండా ఉండాలి.

– విష్ణు రఘువీర్, డీఎస్పీ, పలమనేరు

చంద్రబాబు ప్రభుత్వం రైతులను గాలికొదిలేసింది. వారికి సంబంధించిన ఒక్కో పథకానికి మంగళం పాడేస్తోంది. పంటకు.. గిట్టుబాటు ధరకు.. పరిహారానికి.. కౌలురైతుకు ఎంతో మేలు చేకూర్చే ఈ క్రాప్ నమోదునూ పట్టించుకోకుండా మిన్నకుండిపోయింది. ఫలితంగా రైతులకు అందాల్సిన సంక్షేమం ఆగిపోయింది. దీనిపై ఎలాంటి మార్గదర్శకాలు లేవంటూ యంత్రాంగం సైతం చేతులెత్తేసింది. పుణ్యకాలం ముగిశాక హడావుడి చేస్తే ఏం లాభమని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

మాకొద్దు.. ఈ-పంట



కార్వేటినగరంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

ఈ క్రాప్‌కు బ్రేక్

- కూటమి ప్రభుత్వం నుంచి అందని గ్రీన్‌సిగ్నల్
- ప్రతి ఏటా ఖరీఫ్ ప్రారంభంలోనే ఈ-క్రాప్ నమోదు
- వ్యవసాయ పథకాల రాయితీలకు ఇదే ఆధారం
- మార్గదర్శకాలు వస్తేనే అమలు చేస్తామంటున్న అధికారులు
- కార్డులు ఉంటేనే బ్యాంక్ రుణాలు, పథకాల్లో రాయితీలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

తిరుపతి అర్బన్ /కార్వేటినగరం : కూటమి ప్రభుత్వం ఈ క్రాప్ పథకానికి గండి కొడుతోంది. గడిచిన 2019 నుంచి 2023 వరకు రబీ, ఖరీఫ్ రెండు సీజన్లలో రైతులు ఏయే పంటలు సాగుచేశారనే లెక్కల కోసం పంట ఈ-క్రాఫ్ పేరుతో పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. దీంతో రైతులకు అందాల్సిన రాయితీ విత్తనాలు, ఎరువులతోపాటు గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు, బ్యాంక్ నుంచి రైతులకు రుణాలు, ఇన్‌పుట్‌సబ్సిడీ తదితర ప్రయోజనాలు అన్నదాతకు చేకూరేవి. ఖరీఫ్ సీజన్(జూన్-సెప్టెంబర్)కు సంబంధించి ప్రతి నెలా జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీకల్లా ఈ-క్రాప్ ప్రక్రియను మండలాల వారీగా ఏవోల నేతృత్వంలో రైతు భరోసా కేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్ పూర్తి చేసేవారు. ఆ మేరకు రైతులు బ్యాంక్‌లో పంట రుణాలు పొందేవారు. అయితే ఈ ఏడాది జూలై ముగుస్తున్నా ఈ-క్రాప్ ప్రారంభం చేయలేదు. మరో నెల రోజులకు రైతులకు పంట చేతికి వస్తుంది. ఈ క్రమంలో గిట్టుబాట ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం ప్రశ్నార్థకంగా మారనుంది. అంతేగాదు బ్యాంక్ నుంచి రుణాలు పొందలేని దుస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలకు గండిపడనుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అరకొరగా గుర్తింపు కార్డులు

గత ప్రభుత్వం కొంతమంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించింది. దీంతో సాధారణ రైతులతో సమానంగా వారికి ప్రభుత్వం నుంచి రైతు భరోసాతోపాటు రాయితీ విత్తనాలు, ఎరువులు, బ్యాంక్ రుణాలు, గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు, పంట బీమా తదితర అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింపజేశారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు కొందరికి మాత్రమే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ క్రమంలో ఈ సీజన్‌కు బ్యాంక్‌ల నుంచి క్రాప్ రుణాలు పొందాలంటే సాధ్యమేనా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అధికారులు మాత్రం పదివేల కౌలు రైతుల కార్డులు టార్గెట్ ఇచ్చారని, వాటిని పూర్తి చేస్తామని చెప్పుకొస్తున్నారు.

ఈ క్రాప్‌తో ప్రయోజనాలు

పంటల బీమా వర్తిస్తుంది
పంటకు బ్యాంకు రుణాల మంజూరు
పంటకు నష్టపరిహారం
పంటకు మద్దతు ధర
ఆర్బీకేల్లో ఎరువులు, పురుగు మందులకు రాయితీ
ఈ ఖరీఫ్‌లో సాగు వివరాలు (హెక్టార్లలో)

ఈ ఖరీఫ్ సీజన్‌కు అన్ని పంటలు మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 81,169 హెక్టార్లు. కాగా ఇప్పటి వరకు 23,092 హెక్టార్ల విస్తీర్ణంలో సాగైంది.

సాగు వివరాలు

పంట	సాధారణ సాగు విస్తీర్ణం	సాగైన విస్తీర్ణం
వరి పంట	9,704	2,023
వేరుశెనగ	43,174	10,737
చెరకు	8,526	3,557
ఇతరాలు	19,765	6,775

మార్గదర్శకాలు వస్తేనే..



"ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదుకు ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎటువంటి మార్గదర్శకాలు అందలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడగానే ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను చేపడతాం.

-ప్రభాకర్, జిల్లా వ్యవసాయ అధికారి, చిత్తూరు.

మెరుగైన పారిశుధ్యానికి కృషి

- ప్రతి మూడు నెలలకోసారి మెడికల్ క్యాంప్
- పకడ్బందీగా కార్మికుల నమోదు
- సఫాయి కర్మచారి సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామాల్లో పారిశుధ్య పనులు మెరుగ్గా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో సఫాయి కర్మచారి కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన వైద్యం అందించడంలో డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. కార్మికులకు ప్రభుత్వ పథకాలన్నీ కచ్చితంగా అందజేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు ప్రధాన భూమిక పోషిస్తారని తెలిపారు. వీరికి పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించడంలో మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతగా ఉండాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలో నిపుణులైన వైద్య బృందాలతో ప్రతి మూడు నెలలకోసారి మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. కార్మికులకు షుగర్, బీపీ, రక్త పరీక్షలు, డెంగీ, కంటి పరీక్షలు వంటివి నిర్వహించాలని ఆదేశించారు. మద్యానికి బానిసలైన వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని సచివాలయ పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పారిశుధ్య కార్మికులచే ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి యువజన పథకాలకు నమోదు చేయించాలని కోరారు. ప్రమాద సమయాల్లో ఆ రెండు పథకాలు కార్మికులకు ఆసరాగా నిలుస్తాయని తెలిపారు. ప్రమాద, అనారోగ్య సమయాలలో కార్మికులకు సంబంధించిన బీమా మొత్తాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఇప్పించే బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులకు సంబంధించి ఈపీఎఫ్ ఖాతాల వివరాలను సేకరించాలని పేర్కొన్నారు. చీలాపల్లి సీఎంసీ, అపోలో, కుప్పం పీఈఎస్, తిరుపతిలోని స్విమ్స్, రుయా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద, ఆరోగ్యశ్రీ లేనివారికి ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్మికులకు అవసరమైన యూనిఫాంలు, గ్లౌజులు, బూట్లు అందించాలని ఆదేశించారు. కార్మికులు మరణిస్తే వారి పిల్లలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

రక్షణ సామగ్రి అందిస్తాం

మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు విధి నిర్వహణకు అవసరమైన రక్షణ సామగ్రిని అందిస్తామని సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి వివరించారు. ఆయుష్మాన్ భారత్‌లో నమోదు, ఉన్నత జీవన ప్రమాణాల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎస్.రాజశేఖర్, ఏఎస్పీ ఆరీఫుల్లా, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ కుమార్, డీపీఓ లక్ష్మి, డీసీసీబీ సీఈఓ మనోహర్ గౌడ్, చిత్తూరు, పుంగనూరు, పలమనేరు, మున్సిపల్ కమిషనర్లు అరుణ, నరసింహ ప్రసాద్, రమణా రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

పూతలపట్టు: పరిస్థితులకు అనుకూలంగా వ్యవసాయంలో సాగు పద్ధతులపై ఆత్మ సౌజన్యంతో జిల్లా వనరుల కేంద్రం డీఆర్‌సీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారి నాగ పద్మిని మాట్లాడుతూ రైతులకు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతుల గురించి వివరంగా రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం చేసుకోవడం గురించి తెలిపారు. ఇందులో వేప గింజల కషాయం తయారీ, ట్రైకోడెర్మా విత్తన శుద్ధి చేసుకోవడం, పశువుల ఎరువుతో కలిపి ఎరువును తయారు చేసే పద్ధతిని రైతులకు వివరించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సమతుల్యంగా ఎరువులను వినియోగించుకోవాలని తెలిపారు. రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించుకుని ఆదాయం వచ్చే మార్గాలను శాస్త్రవేత్తలు అన్వేషించిన మార్గాలను తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మధురవాణి, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దేవుని భూమి కబ్జాకు కుట్ర

- అది దేవుడు మాన్యమేనని తేల్చేసిన కోర్టు
- తెలుగు తమ్ముళ్ల మద్దతుతో భూమి ఆక్రమణకు యత్నం
- దీని విలువ దాదాపు రూ.20 కోట్లకు పైమాటే


అన్యాక్రాంతానికి గురైన సీతారాముని ఆలయ భూమి

పలమనేరు: పట్టణంలోని మదనపల్లె రోడ్డుకు ఆనుకుని సాయిబాబా ఆలయం వద్ద నున్న స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయానికి చెందిన భూమిపై కొందరి కన్ను పడింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల సాయంతో స్వామివారి భూమినే కాజేయాలన్న కుట్ర మొదలైంది. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.20 కోట్లు పలుకుతుండడంతో ఎలాగైనా దీన్ని అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నాలు మొదలెట్టారు. కొందరు టీడీపీ నేతల మద్దతుతో అక్రమార్కులు ఇందులో రాళ్లను నాటి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి రంగం సిద్ధం చేస్తున్నారు. మదనపల్లె రోడ్డుకు ఆనుకొని ఉన్న భూమి కావడంతో దీన్ని స్వాధీనం చేసుకుంటే వెనుకనున్న స్థలాల్లో వెంచర్లు వేసుకోవచ్చనే ఎత్తుగడతో ఈ వ్యవహారం సాగుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలి ఉన్నాయి.

పట్టణంలోని బజారు వీధిలో శ్రీసీతారామాంజనేయస్వామి పురాతన ఆలయం ఉంది. ఇందులో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల ఆధ్వర్యంలో ఇప్పటికీ నిత్య పూజలు జరుగుతున్నాయి. ఈ ఆలయ అభివృద్ధి, నిత్య కైంకర్యాలకోసం పట్టణానికే చెందిన గిడ్డన్నగారి పెద్దనంజుండప్ప సర్వేనెం:376/2లో 8.06 ఎకరాలపైకి, రోడ్డుకు ఆనుకొని ఉన్న 1.9 ఎకరాలను అప్పటి ఆలయ ధర్మకర్త ఉగ్రాణం నారాయణ స్వామి శెట్టికి 1928లో రిజిస్టర్ పత్రం ద్వారా దానం చేశాడు. ఇందుకు 1977లో ప్రభుత్వం ఆ సర్వే నెంబరును 376/2ఏగా సబ్ డివిజన్ చేసి పట్టాను సైతం మంజూరు చేసింది.

అసలు అలాంటి ఆలయమే లేదని..

పలమనేరు పట్టణంలో అసలు సీతారామాంజనేయస్వామి ఆలయమే లేదని తమ తండ్రి దేవాలయానికి భూమి దానం చేయలేదని గిడ్డన్నగారి పెద్దనంజుండప్ప కుమారులైన రాజశేఖర్, వీరభద్ర 1990లో స్థానిక కోర్టులో వ్యాజ్యం వేశారు. అప్పట్లో వారి వాదనలు విన్న కోర్టు 1997లో ఈ పిటిషన్‌ను కొట్టేసింది. ఆ భూమి ఆలయానిదేనని కోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. దీంతో అప్పటినుంచి ఆలయ ధర్మకర్త ఉగ్రాణం నారాయణస్వామిశెట్టి మనవడు వాసుదేవ్ ఈ భూమిని పర్యవేక్షిస్తున్నారు.

ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని..

ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో గతంలో ఆలయానికి భూమిని దానం చేసిన వారి వారసులు కొందరు స్థానిక టీడీపీ నేతలను కలిసి ఎలాగైనా ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని పథకం పన్నారు. ఇందుకు వారి మద్దతు లభించడంతో శుక్రవారం దేవుని భూమిలో రాళ్లను నాటే పనులు ప్రారంభించారు. దీనిపై మండిపడిన ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసుదేవ్ జరిగిన విషయాన్ని స్థానిక మీడియాకు తెలిపారు. దీనిపై తాను ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. ఇక్కడ సాగుతున్న ఆక్రమణలను గమనించిన జనం ఆ దేవుడి సొత్తు ఆ సీతారాముడే రక్షించుకోవాల్సిందేనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఆలయభూమిని కాపాడాల్సి ఉంది.

తిరుచ్చిపై శ్రీవారి కటాక్షం



పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనులపండువగా సాగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి ఏకాంత సేవ నిర్వహించారు.

మొగిలి ఘాట్‌లో వాహనాలు ఢీకొని..


రహదారిపై బోల్తాపడిన ట్రాక్టర్


మొగిలి ఘాట్‌లో ట్యాంకరును ఢీకొన్న కంటైనర్

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ఒక దానికి ఒకటి వాహనాలు ఢీకొని ఆరుగురికి స్వల్పగాయాలు అయిన ఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా.. కోలార్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఓ కంటైనరు ముందు వెళ్తున్న పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొంది. దీంతో ట్యాంకర్ డివైడర్‌ను ఢీకొనడంతో చిత్తూరు నుంచి పలమనేరుకు వెళ్తున్న రెండు కార్లు, ట్రాక్టరు, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని జాతీయ రహదారిపై ఢీకొన్న వాహనాలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మానసిక రోగుల ఆరోగ్య రక్షణే ధ్యేయం

- ఏపీ మానసిక వైద్యబృంద సభ్యులు
- చిత్తూరులో ఏపీ మానసిక వైద్య సమావేశం–2024
- రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన మానసిక వైద్య నిపుణులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మానసిక రోగుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని జాతీయ మానసిక వైద్యుల సంఘ బృంద సభ్యులు తెలిపారు. చిత్తూరు నగరం మురకంబట్టులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శనివారం ఏపీ మానసిక వైద్య సమావేశం–2024 పేరుతో రాష్ట్ర సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి మానసిక వైద్య నిపుణులు హాజరయ్యారు. మానసికంగా మనిషి ఎదుర్కొంటున్న సమస్యలు, కొత్తగా పుట్టుకొస్తున్న మరిన్ని లక్షణాలపై వారు వివరించారు. అనంతరం సంఘ సభ్యులు మూర్తి, సుధాకర్, లోకేశ్వర్‌రెడ్డి, నరసింహారావు శరత్‌చంద్ర మాట్లాడుతూ టెక్నాలజీకి బానిసై పిల్లల నుంచి పెద్దల వరకు మానసిక సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను బయటపడేందుకు చికిత్స ఒక్కటే మార్గమన్నారు. మూఢ నమ్మకాల జోలికి వెళ్లకూడదన్నారు. ప్రధానంగా ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం మానసిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం అన్నారు. అలాగే మానసిక ఆరోగ్య చట్టం నుంచి సడలింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. దీని కారణంగా కొంతమంది మానసిక రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో ఇబ్బందులు ఉన్నట్లు చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో కొత్త మానసిక లక్షణాలు, వాటి చికిత్సపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది శేషాద్రినాయుడు, సదస్సు నిర్వాహకులు దినేష్, జయప్రియ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి మండీలు దగ్ధం


మంటల్లో కాలి బూడిదైన మామిడి మండీ

పాకాల: మండలంలోని దామలచెరువులో ఉన్న మామిడి మండీల్లో 11 మండీలు అగ్నికి ఆహుతయ్యాయి. శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్ కావడం వల్ల మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తిరుపతి డీఎఫ్ఓ వీ.రమణయ్య ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది పాకాల, పీలేరు, తిరుపతి, చిత్తూరు నుంచి నాలుగు అగ్నిమాపక వాహనాలతో మంటలార్పారు. మండీల్లో బీరువాలు, మామిడి తోటలకు మందులు కొట్టే యంత్రాలు, కొన్ని మండీల్లో ద్విచక్ర వాహనాలు పూర్తిగా ఆహుతయ్యాయి. మండీలకు పక్కనే ఉన్న ఎస్.మహబూబ్‌బి ఆపార్ట్‌మెంట్‌లో ఉన్న రియాజ్‌అలీ, ఇంతియాజ్, మునాఫ్, మొబీనా ఇళ్లలోకి మంటలు వ్యాప్తించాయి. ఆయా ఇళ్లలోని గృహోపకరణాలు మంటల్లో కాలిపోయాయి. గాలులు విపరీతంగా వీయడంతో మంటలు అధికమయ్యాయి. ఎంత ప్రయత్నించినా మంటలు ఒక మండీ నుంచి మరో మండీకి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.80 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉటుందని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి మంటల్లో కాలిపోయిన మండీలకు నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మృతి


రమేష్ చంద్ర ప్రసాద్ (ఫైల్)

నింద్ర: తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు రమేష్ చంద్ర ప్రసాద్(77) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఈయన ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షులుగా పనిచేశారు. గత నెల రోజుల క్రితం గుండెకు సంబంధిత ఆపరేషన్ చేసుకున్నారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో వైద్యం పొందారు. వారం రోజుల క్రితం స్వగ్రామం అయిన ఊరూరుపేటకు వచ్చారు. అయితే రాత్రి గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.